క్లుప్తంగా

కావమ్మ వార్షికోత్సవ పత్రికల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని గాంధీవీధి కావమ్మ సంధులో వెలసిన శ్రీకావమ్మ మారయ్య, శ్రీరామ మందిరం నాలుగో వార్షికోత్సవం పురస్కరించుకుని కరపత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ జూలై 4, 5, 6 తేదీల్లో వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవికుమార్, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యుడు వడకలూరు మస్తానయ్య, కమిటీ సభ్యులు నెల్లూరు కన్నయ్య, జగదీష్, కాట్రపల్లి చంద్రశేఖర్, గాం.దీ, నెల్లూరు శివప్రసాద్ వెంకటేశ్వర్లు, శరవణకుమార్, సతీష్, మోహనకృష్ణ, కమలాకర్, ఆర్ముగం, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

నాగలాపురం: పిచ్చాటూరు మండలం కీలపూడిలోని శ్రీముత్యాలమ్మ కొలుపు సందర్భంగా మూడో రోజు ఆలయంలో ఆదివారం సాయంత్రం కంకణం ధరించిన దీక్షాపరులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ప్రతి ఏటా ఈ ఆలయంలో పురుషులు, చిన్న పిల్లలు, అగ్ని గుండ ప్రవేశం చేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా తొలిసారి పురుషులతో కలిసి మహిళలు కూడా అగ్నిగుండ ప్రవేశం చేయడం విశేషం. చివరిగా అమ్మవారు బాణసంచా పేలుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధుల్లో విహరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పాల్ పద్మనాభం పర్యవేక్షించారు.

నేడు ప్రదోష పూజలు


ఆలయ అధికారి లత

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీసర్వ మంగళ సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి లత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకీశ్వర స్వామికి, మరకదాంబికై అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రశీదు పొంది పాల్గొనాల్సిందిగా తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరిలో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. పెనుగాలులు వీయడంతో గుంటకట్ట, పాలకేంద్రం ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. చింతగుంట ప్రాంతంలో చెట్లు నెలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బస్టాండులో సమస్యల తిష్ట

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ తిరుపతి జిల్లాలో ముఖ్యమైందిగా చెప్పుకోవచ్చు. తిరుపతి తరువాత జిల్లాలో పెద్ద ఆర్టీసీ బస్టాండు అంటే శ్రీకాళహస్తి. 1980లో అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ ఆర్టీసీ బస్టాండు ఏర్పాటైంది. జిల్లాలో అత్యధికంగా నెలకు సుమారు రూ.30.లక్షలు నుంచి రూ.40లక్షలు ఆదాయం వచ్చే బస్సు డిపో కూడా ఇదే. ఆర్టీసీ కార్గో సర్వీసు కూడా ఏర్పాటు చేశారు. దాని ద్వారా రూ.1.50 లక్షలు నెలకు ఆదాయం వస్తోంది. అయినా బస్టాండు ప్రాంగణంలో తాగునీటి సదుపాయం లేదు. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఎక్కడిపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడంతో భరించలేని దుర్వాసన వస్తోంది. విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. సమీపంలో అనేక మద్యం దుకాణాలు ఉండడంతో బిక్షగాళ్లు, కూలీ పనులకు వచ్చినవారు తాగేసి ఆర్టీసీ బస్టాండులోని కుర్చీలు, బల్లలమీద పడుకుంటున్నారు. అరకొరగా ఉన్న సీసీకెమెరాలు కూడా పనిచేయడం లేదు. ఫలితంగా ఈ బస్టాండు ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది.





తాగునీటి కుళాయిలు


బస్టాండులో విశ్రాంతి తీసుకుంటున్న మందుబాబులు


ఆర్టీసీ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త


దుస్థితిలో ఉన్న తాగునీటి రిఫ్రిజిరేటర్


అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థ


ఎక్కడ పడితే అక్కడ గోడలపై పాన్‌పరాగ్ మరకలు



మూత్ర విసర్జనశాల

వైభవంగా ఏకాదశి ఉత్సవం


ఊరేగింపులో కల్యాణ వెంకన్న

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఉత్సవర్లు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తుల నుండి హారతులు అందుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి తిరుచ్చి వాహనం అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు నరసింహ భట్టాచార్య పర్యవేక్షించారు.

యువత పోరుబాటకు తరలిరండి


వినోద్‌యాదవ్

వరదయ్యపాళెం: విద్యార్థులు, నిరుద్యోగులు, యువతను మోసగించిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న వైఎస్ఆర్ సీపీ యువత పోరుబాటను విజయవంతం చేయాలని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు వినోద్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ఆర్ సీపీ యువజన విభాగంతోపాటు యువత, నిరుద్యోగులు, విద్యార్థులు సత్యవేడు నియోజకవర్గం నుండి పెద్దఎత్తున పాల్గొని, నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కూటమి మోసాలపై సంతకాల సేకరణ


వరదయ్యపాళెంలో సంతకాల సేకరణ

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం మోసాలపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం వరదయ్యపాళెం బస్టాండ్ వద్ద ప్రజల నుండి సంతకాల సేకరణ చేపట్టారు. నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసం చేయడం, పూర్తిస్థాయిలో తల్లికి వందనం చెల్లించకపోవడం రైతులకు అన్నదాత సుఖీభవ చెల్లించకపోవడం తదితర మోసాలపై సంతకాల సేకరణ చేపడుతున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయక కార్యదర్శి కత్తి రవి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తరుణ్‌కుమార్, ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, మురళి, ప్రేమ్‌కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

దొంగలు హల్‌చల్

- నిద్రిస్తున్న ఇద్దరి మెడలో బంగారు చోరీ


బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

కేవీబీపురం: మండలంలో దొంగలు శనివారం అర్ధరాత్రి అనంతరం హల్‌చల్ చేశారు. ఇంటి వాకిట నిద్రిస్తున్న ఇద్దరు మహిళల మెడలో ఉన్న బంగారు చెయిన్, మంగళసూత్రాన్ని కత్తిరించి ఉడాయించారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన మొదటి వీధిలో మల్లీశ్వరి, చివరి వీధిలో నీలమ్మ అనే మహిళలు శనివారం తమ ఇళ్ల వరండాలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి అనంతరం ఒంటి గంట సమయంలో నీలమ్మ ఇంట ప్రవేశించిన దొంగలు ఆమె మెడలో ఉన్న సుమారు 32 గ్రాముల బంగారు గొలుసును కత్తిరించుకెళ్లారు. ఇదే సమయంలో మేల్కొన్న ఆమె కేకలు వేయడంలో గొంగ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేదు.

మళ్లీ రెండు గంటల వ్యవధిలో...

ఇక్కడ చోరీకి పాల్పడిన దొంగలు చోరీల్లో ఘటికులని తెలుస్తోంది. మళ్లీ రెండు గంటల వ్యవధిలో అదే గ్రామంలోని మల్లీశ్వరి తమ ప్రతాపం చూపారు. వరండాలో గాఢనిద్రలో ఉన్న మల్లీశ్వరి మెడలో ఉన్న సుమారు 34 గ్రాముల బొందుచైను (మంగళసూత్రాన్ని కత్తించారు.అలికిడికి మేల్కొన్న ఆమె కేకలు వేయడంతో దొంగ గోడదూకి చీకట్లో అదృశ్యమయ్యాడు. బాధితులు సమాచారం ఇవ్వడంతో పుత్తూరు డీఎస్పీ రవికుమార్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. డీఎస్పీ వెంట సీఐ రవీంద్ర, ఎస్ఐ రవిశంకర్, పోలీసులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

వెంకటగిరి (సైదాపురం) : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞ కుమార యాచేంద్ర తెలిపారు. ఆయన ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ మస్తాన్ యాదవ్‌తో కలిసి వెంకటగిరి పట్టణం తారాకరామా క్రీడా ప్రాంగణంలో మార్పు సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. మార్పు సంస్థ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ బీకే ప్రసాద్, కౌన్సిలర్ ఎంఏ నారాయణ, చిగురుపాటి లావణ్య, జలగం కామాక్షి, ఆవుల వెంకటేశ్వర్లు, ధనుంజయ్, సుకుమార్, తేజ, హరి, కిరణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని గ్రామాలకు చెందిన మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నట్టు క్రిష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన ఆదివారం తమ్మినపట్నం గ్రామంలో కేఎఫ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నేడు ఆర్గానిక్ ఆహారంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి లాభాలు ఎలా పొందాలనే విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాకేష్‌రంజన్, షఫీ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన సత్యవేడు యూత్ అధ్యక్షుడు


వంశీకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వరదయ్యపాళెం: నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు మండల వైఎస్ఆర్ సీపీ యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి వంశీకృష్ణారెడ్డి ఆదివారం తిరుపతిలోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో గౌరవ పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యవేడు మండల యూత్ అధ్యక్షుడిగా నియమితులైన వంశీకృష్ణారెడ్డిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి శాలువాతో సత్కరించారు. పార్టీ సిద్ధాంతాలను యువతకు వివరించి, పార్టీ వైపు ఆకర్షింపజేయాలని సూచించినట్లు వంశీ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వండి సారూ!


కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


ఫ్యూజు క్యారియర్‌ల మరమ్మతులకు గురై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- విద్యుత్ లోవోల్టేజీతో సమస్యతో సతమతం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెండా మాను సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు కనెక్షన్ ఇవ్వకపోవడంతో విద్యుత్ లోవోల్టేజీతో సమస్యతో గ్రామస్తులు సతమతమవుతున్నారు. వినాయక, సహజ పాఠశాల, వాటర్‌ప్లాంట్, గ్రామీణబ్యాంకు, జెండామాను వీధులలో విద్యుత్ లోవోల్టేజీతో సమస్యను పరిష్కరించడం కోసం నెల క్రితం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయితే కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉంది. అంతేకాకుండా బీఎంసీ వద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు క్యారియర్‌ల మరమ్మతుల కారణంగా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు అందుబాటులో లేక పోవటంతో సమస్యను ఎవరికి చెప్పాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు.

బీఎన్ కండ్రిగలో అన్నదానం


బుచ్చినాయుడుకండ్రిగలో అన్నదానం చేస్తున్న నాయకులు


కేక్ కటింగ్, మొక్కలు పంపిణీ


అన్నదానం చేస్తున్న సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కేవీ నిరంజన్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కేక్‌కట్ చేసి, 300 మందికి అన్నదానం చేశారు. వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ మణినాయుడు, జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ వేలూరు రాకేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురునాథం, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు బొర్రా మాధవిరెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య, నాయకులు దేవాదాసురెడ్డి, జయచంద్రనాయుడు, చంద్రారెడ్డి, ప్రసాద్‌పాల్, సంజీవయ్య, కిరణ్‌యాదవ్, నాగూర్, గంగాధరం, రమేష్‌నాయుడు, రమేష్, మునిరత్నం, మోహన్, శివయ్య, కృష్ణయ్య, బాలాజీ, కత్తిశివ, సురేష్, చంద్ర, వెంకటయ్య, సురేష్, పరంధామయ్య, అశోక్, వెంకటేష్, సిద్ధేశ్వర్ పాల్గొన్నారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి జన్మదిన వేడుకలు కేవీబీపురం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పలు ప్రభుత్వ పాఠశాలల వద్ద మొక్కలు నాటారు. అందరికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు మణి, దశరథరామిరెడ్డి, బాల సుబ్రమణ్యం, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ వర్మ, కేవీబీపురం సర్పంచ్ గిరి, హరి, మురళీ, ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: ప్రజా సమస్యలపై నిత్యం ఢిల్లీలో పోరాడుతూ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి వన్నె తెచ్చిన ఘనత ఎంపీ మద్దిల గురుమూర్తికే దక్కిందని వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని వరదయ్యపాళెంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, సీనియర్ నేత దామోదర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిబాబురెడ్డి, మాజీ మండల కన్వీనర్ పాల సుబ్రమణ్యంరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు బందిల సురేష్ (బూత్ కమిటీ), మహేంద్ర (బీసీ సెల్), శివా యాదవ్ (ప్రచార కమిటీ), గిరిరెడ్డి (గ్రీవెన్స్ సెల్), మైనారిటీ సెల్ మండల కన్వీనర్ అబ్దుల్ మజీద్, నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ శోభన్ యాదవ్, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ ఎంటెక్ బాబు, మండల ఉపాధ్యక్షుడు గిరి, మండల బీసీ సెల్ కన్వీనర్ శేఖర్‌యాదవ్, నాయకులు విజయ్‌రెడ్డి, లోకేష్, సునీల్, కుమారస్వామి, ఎబినైజర్ పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: తిరుపతి ఎంపీ గురుమూర్తి జన్మదినాన్ని ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్థానిక జాతీయ రహదారి బైపాస్ సర్కిల్ వద్ద వైఎస్ఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ముఖ్యనాయకులు అన్నాదొరై, రాకేష్ కిరణ్, ఎంపీటీసీలు రవి, శంకరయ్య, సర్పంచ్‌లు సుబ్రమణ్యం రెడ్డి, తుంబూరు నాగూరు, తిరువట్యం నాగూరు, నాయకులు దొరైరాజ్, ఏలుమలై, పీజీ బాబు, పరంధామరెడ్డి, చీరాలయ్య, మంజునాథ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి జన్మదిన వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: సత్యవేడులో ఎంపీ గురుమూర్తి జన్మదిన వేడుకలను వైఎస్ఆర్ సీపీ నాయకుడు కేవీ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడురోడ్ల కూడలిలోని వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. 200 మంది పేదలకు అన్నదానం చేశారు. సర్పంచ్ రమేష్,సెంథిల్, శ్రీనివాసులురెడ్డి, పునీదకుమార్, మోహన్ రెడ్డి, వీడీ శరవణన్, రాబర్టు, శేఖర్, మస్తానీ, పళణి, పూల శ్రీను, ఆరూరు శేఖర్, సోము, సురేష్, దయాళ్, ధన, సుధాకర్ రాజు, జోసెఫ్, చంద్రబాబు, కుమార్, ఈశ్వర్ గంగాధర్, పురంధర్, నిత్య తదితరులు పాల్గొన్నారు.


నారాయణవనంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


పంచాయతీ కార్యాలయ ఆవరణలో కేక్ కటింగ్


వరదయ్యపాళెంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

జీఎన్‌టీ రోడ్డులో కూలిన చెట్టు


చెట్టును తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో జీఎన్‌టీ రోడ్డు పక్కన వున్న పెద్ద చెట్టు ఆదివారం సాయంత్రం విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఫేక్ ఫజులుల్లా సిబ్బందితో అక్కడికి చేరుకుని జేసీబీతో చెట్టును పక్కకు తొలగించారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

పెళ్లకూరు: మండలంలోని నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో గుర్రప్పతోట వద్ద ఆదివారం ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. డ్రైవర్ తిరుపతయ్యకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఆయిల్ ట్యాంకర్ విజయవాడ నుంచి బెంగుళూరు బయలుదేరింది. గుర్రప్పతోట గ్రామం వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో ట్యాంకర్‌లోని ఆయిల్ నేలపాలైంది. గాయపడిన డ్రైవర్ తిరుపతయ్యను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.